నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I హైదరాబాద్, మంగళవారం 3 డిసెంబర్ 2024
YADADRI BHUVANAGIRI

## తెలంగాణ బ్యాడ్మింటన్ టీమ్ కోచ్‌గా రామకృష్ణ

మిర్యాలగూడ, డిసెంబర్ 2: ఈ నెల 4 నుంచి 7వ రకు ముంబైలోని థానే జరుగనున్న బాలబాలికల యునెక్స్ సన్‌రైజ్ మూడో మినీ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్–2024కి అండర్–11 తెలంగాణ జట్టు కోచ్‌గా మిర్యాలగూడ పట్టణానికి చెందిన మారబోయిన రామకృష్ణ ఎంపికైనట్లు బ్యాడ్మింటన్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.ప్రశాంత్, పి.నవీన్ తెలిపారు. సోమవారం మీడియాతో వారు మాట్లాడుతూ గతంలో రామకృష్ణ అండర్–13 రాష్ట్ర కోచ్‌గా పలు విజయాలను తెలంగాణకు అందించినట్లు పేర్కొన్నారు. కోచ్ రామకృష్ణ మాట్లాడుతూ అవకాశాన్ని ఇచ్చిన బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ పుల్లెంల గోపిచంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



తెలంగాణ రాష్ట్ర బ్యాడ్మింటన్ టీం కోచ్‌గా ఎంపికైన రామకృష్ణ

# మిగిలిన రుణమాఫీకి ఎగనామమేనా?



## జిల్లాలో మాఫీ కాని రైతులు వేలల్లో..

**రూ.2లక్షలకు పైగా మాఫీ ఉత్త ముచ్చటే**

**నాడు అధికారిక గ్రీవెన్స్‌కే 4,200 దరఖాస్తులు**

**కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై అన్నదాతల ఆగ్రహం**

రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీకి ఎగనామం పెట్టిందా? నాలుగో విడుతలోనూ మొండిచెయ్యే చూపిందా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. సర్కారు లెక్కలకు, క్షేత్రస్థాయి పరిస్థితి పొంతన లేకపోవడమే ఇందుక్కారణం. కాంగ్రెస్ ప్రభుత్వం తూ.తూ.మంత్రంగా మాఫీ చేసి చేతులు దులుపుకోవడంతో రైతులందరికీ రుణమాఫీ అందని ద్రాక్షగానే మిగిలింది. నాలుగో విడతతో రుణమాఫీ పూర్తయ్యిందని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంతో రూ.2లక్షలకు పైగా రుణమాఫీ ఉత్త ముచ్చటేనని తేలిపోయింది. జిల్లాలో ఇంకా 30 శాతం మంది రైతులకు మాఫీ కోసం ఎదురు చూస్తున్నట్లు తెలుస్తున్నది. – యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ)



### ఇంకా 30 శాతం మందికి పెండింగ్?

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నాలుగో విడతలో 11,690 మందికి రూ. 111.65 కోట్లు మాఫీ చేయనుంది. త్వరలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కానున్నాయి. ఈ లెక్కన నాలుగు విడుతలు కలిపి 80,982 మందికి మాఫీ అవుతుంది. కానీ గతంలో బీఆర్ఎస్ సర్కారు హయాంలో కేవలం రూ. లక్షలోపు 59,726 మందికి రూ. 364 కోట్లు మాఫీ చేసింది. రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్న లెక్కలకు, క్షేత్ర స్థాయిలో పరిస్థితికి చాలా వ్యత్యాసం ఉంది. గతంలో ప్రభుత్వం విడుదల చేసిన అర్హుల జాబితాలో పేర్లున్నా కూడా చాలామంది రైతులకు మాఫీ కాలేదు. దాంతో బాధితులు బ్యాంకుల చుట్టూ రోజుల తరబడి ప్రదక్షిణలు చేయడం తెలిసిందే. ఇప్పటికీ జిల్లాలో 30 శాతం మందికి రుణమాఫీ కావాల్సి ఉన్నట్లు తెలుస్తున్నది.

అసెంబ్లీ ఎన్నికల ముందు రైతులకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. మాఫీ ఒకేసారి చేస్తామని పలుమార్లు ప్రకటించినా.. విడుతల వారీగా చేస్తూ వస్తున్నది. జూన్ 18 నుంచి రుణమాఫీ కార్యక్రమం ప్రారంభించగా, రైతు వేదికల్లో కార్యక్రమాలు అంటూ హంగూ ఆర్భాటం చేసింది. మూడు దఫాలుగా కలిపి 69,292మంది రైతులకు రూ. 557 కోట్ల రుణ మాఫీ చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. లక్ష రూపాయల్లోపు పంట రుణాలు తీసుకున్న 36,483మంది రైతులకు రూ.199.46 కోట్లు, లక్ష నుంచి లక్షన్నర వరకు తీసుకున్న 19,798 మంది రైతులకు రూ. 193.96 కోట్లు, రూ.2లక్షల వరకు 13,011 మంది కర్షకులకు రూ. 164.66 కోట్లు మాఫీ చేసినట్లు పేర్కొన్నారు.

### రూ.2లక్షలకు పైగా మాఫీ ఉత్తదేనా..?

నాలుగో విడతతో రుణమాఫీ ప్రక్రియ పూర్తయ్యిందని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారు. అయితే 2లక్షలకు పైగా రుణాలు ఉన్న రైతులకు మాఫీ కాలేదు. వీరికి కూడా మాఫీ చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించింది. ముందుగా రెండు లక్షలకు పైన ఉన్న డబ్బులు చెల్లిస్తే చేస్తామని తిరకాసు పెట్టింది. దాంతో కర్షకులు పైన ఉన్న డబ్బులను బ్యాంకుల్లో జమ చేశారు. కొందరైతే మాఫీ అవుతుందనే ఆశతో అప్పు చేసి మరీ చెల్లించారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం మాత్రం రూ.2లక్షలకు పైన వారికి మొండిచెయ్యే చూపించింది. దాంతో అటు మాఫీ కాక.. ఇటు తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### గ్రీవెన్స్ సెల్‌కు భారీగా దరఖాస్తులు..

రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తు స్వీకరించేందుకు గతంలో ప్రభుత్వం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసింది. టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచింది. జిల్లా వ్యవసాయ అధికారి, మండల వ్యవసాయ అధికారి కార్యాలయాల్లోనూ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అలా జిల్లాలో ఇప్పటి వరకు 4,200 దరఖాస్తులు అందాయి. ఇవి కేవలం రైతులు ప్రభుత్వ కార్యాలయాల్లో లిఖిత పూర్వకంగా దరఖాస్తు చేసినవి మాత్రమే. అప్లికేషన్ పెట్టుకోని కర్షకులు మరెందరో ఉన్నారు. దరఖాస్తుల్లో డేటా నాట్ ఫౌండ్, ఆధార్ కార్డు వివరాలు మిస్ మ్యాచ్, బ్యాంక్ ఖాతా క్లోజ్ వంటి కారణాలు చూపించాయి. వీటిలో సమస్యలను గుర్తించి అందరికీ మాఫీ చేస్తామని గతంలోనే సర్కారు ప్రకటించింది. అంతేగాక మొదట్లో ఒకే ఇంట్లో ఇద్దరు ఉండడం, రేషన్ కార్డు లేకపోవడం వంటి కొర్రీలతో మాఫీ చేయలేదు. ఇప్పుడు వీరి సమస్యను సర్కారు పరిష్కరించిందా, లేదా? అనేది అధికారుల వద్ద కూడా స్పష్టత లేదు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

## గ్యారెంటీల పేరుతో దగా చేసిన కాంగ్రెస్

- కాంగ్రెస్ సంబురాలను చూసి నవ్వుకుంటున్న జనం
- డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

ఆలేరు రూరల్, డిసెంబర్ 2 : ఆరు గ్యారెంటీ పేరులో కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేసిందని, అలాంటి నేతలు ఇప్పుడు విజయోత్సవాల పేరుతో సంబురాలు చేసుకుంటుంటే జనం నవ్వుకుంటున్నారని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని గుండ్లగూడెంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళలకు రూ.2,500, కల్యాణలక్ష్మి పథకంతో తులం బంగారం, పింఛన్లు రూ.4వేలు, విద్యార్థినులకు స్కూటీలు, రైతులకు పెట్టుబడి సాయం ఇచ్చినందుకు సంబురాలు జరుపుకొంటున్నారా, ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ అందించిన పింఛన్‌ను కూడా సరిగ్గా ఇవ్వడం లేదని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ యాదగిరిగుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మాజీ వైస్ చైర్మన్ గ్యాదపాక నాగరాజు, ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, బీఆర్ఎస్ ఆలేరు పట్టణాధ్యక్షుడు పుట్ట మల్లేశ్‌గౌడ్, గుండ్లగూడెం మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ కృష్ణంరాజు, నాయకులు వెంకటేశ్, వెంకటేశ్, శ్రీనివాస్, కృష్ణ ఉన్నారు.



రామన్నపేటలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న పర్యావరణ పరిరక్షణ వేదిక, అఖిల పక్షం నాయకులు

## అంబుజా పరిశ్రమకు ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

- రామన్నపేటలో అఖిలపక్షం ఆందోళన

రామన్నపేట, డిసెంబర్ 2 : లగచర్ల, దిలావర్‌పూర్ మాదిరిగానే రామన్నపేటలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనను పూర్తి స్థాయిలో ఉపసహరించుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటన విడుదల చేయాలని పర్యావరణ పరిరక్షణ వేదిక, అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట ప్లకార్డులతో నిరసన తెలిపారు. గో బ్యాక్ అంబుజా.. అదానీకి వంత పాడితే పాతాళానికి తొక్కుతాం అంటూ నినాదాలు చేశారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును ప్రజాభిప్రాయ సేకరణలో ముక్తకంఠంతో ప్రజలు వ్యతిరేకించడాన్ని గుర్తు చేశారు. 40 రోజులు గడుస్తున్నా నేటికీ ప్రభుత్వం, కాలుష్య నియంత్రణ మండలి ప్రకటన చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నిస్తే ప్రజా పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ వేదిక కన్వీనర్ జెల్లెల పెంటయ్య, కో కన్వీనర్ ఎండీ రేహాన్, అఖిల పక్షం నాయకులు సాల్వేరు అశోక్, ఎస్‌కే చాంద్, బొడ్డుపల్లి వెంకటేశం, జెల్ల వెంకటేశం, ఎండీ జమీరుద్దీన్, వనం చంద్రశేఖర్, మీర్జా ఫజల్‌బేగ్, కందుల హన్మంతు, ఎండీ నాసర్, పున్న వెంకటేశం, ఆముద లక్ష్మణ్, గురుకు శివ పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఆర్ నిర్వాసితుల ధర్నా

- చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన

చౌటుప్పల్, డిసెంబర్ 2 : రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని, భూమికి బదులు భూమి ఇవ్వాల్సిందేనని లేదా బహిరంగ మార్కెట్ ప్రకారం ధర ఇవ్వాలని ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అధికారులు దొంగ చాటుగా రాత్రిపూట గట్టుచప్పుడు కాకుండా డ్రోన్ల ద్వారా సర్వేలు చేస్తున్నారని మండిపడ్డారు. మిగతా చోట్ల ఓఆర్ఆర్ నుంచి 48 కిలోమీటర్లు తీసుకొని, ఇక్కడ 28 కిలోమీటర్లకు పరిమితం చేయడం ఏంటని ప్రశ్నించారు. కలెక్టర్, ఆర్డీఓ, జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యేల సమక్షంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. తద్వారా తమ సమస్యలను విన్నవిస్తామని చెప్పారు. తమ సమస్యలు విని తగిన న్యాయం చేస్తే భూములు ఇచ్చేందుకు సిద్ధమన్నారు. తమతో ఎందుకు సమావేశం కావడం లేదని ప్రశ్నించారు. ఇదంతా పక్కన పెట్టి సర్వేలు, అవార్డు ఎంక్వైరీలు చేస్తున్నారన్నారు. ఇలానే కొనసాగితే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి ధర్నా విరమింపజేసేందుకు ప్రయత్నం చేశారు. అయినా రైతులు భీష్మించుకొని కూర్చున్నారు. ఆర్డీఓ వచ్చి తమకు సమాధానం చెప్పాలని కోరారు. ఆర్డీఓ బయటకు వెళ్లారని సిబ్బంది చెప్పారు. అయినా వచ్చే వరకూ ధర్నా వీడమని పట్టుబట్టారు. కార్యాలయం లోపలికి వెళ్లి మళ్లీ బైఠాయించారు. ఏసీపీ మధుసూదన్‌రెడ్డి, సీఐ మన్మథకుమార్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది లోపలికి వెళ్లి ధర్నా విరమింపజేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ట్రిపుల్ ఆర్ బాధితుల సంఘం కన్వీనర్ చింతల దామోదర్‌రెడ్డి, బీజేపీ అంసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షంగౌడ్, రైతు సంఘం నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, బండారు నర్సింహా, ఎండీ పాషా, రైతులు పాల్గొన్నారు.



చౌటుప్పల్ ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితులు

## కాంగ్రెస్ పాలనలో గురుకులాలు నిర్వీర్యం

- బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు

బొమ్మల రామారం/తుర్కపల్లి, డిసెంబర్ 2 : కాంగ్రెస్ పాలనలో గురుకుల విద్యా సంస్థలు నిర్వీర్యం అవుతున్నాయని టీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని చీకటిమామిడి గ్రామంలో గల జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలను, మల్యాలలోని కేజీబీవీని బీఆర్ఎస్వీ ఆధర్యంలో సోమవారం సందర్శించారు. గురుకుల విద్యార్థులతో మాట్లాడేందుకు ప్రిన్సిపాల్ అంగీకరించక పోవడంతో మీడియాతో మాట్లాడారు. విద్యర్థుల సమస్యలు తెలుసుకోవడానికి వచ్చిన విద్యార్థి నాయకులను పాఠశాలలోకి నిరాకరించడం సరికాదన్నారు. గురుకుల పాఠశాలల నిర్వహణలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అంతకు ముందు తుర్కపల్లి మండలంలోని రాంపూర్ తండాలో గల ఆదర్శ పాఠశాలలను బీఆర్ఎస్ నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అన్నంలో పురుగులు వస్తున్నాయని, నెల నెలా హైజెనిక్ కిట్లు రావడం లేదని, హాస్టల్‌లో విద్యుత్ లైట్లు వెలుగడం లేదని విద్యార్థులు వివరించారు. గురుకులాలను మూసివేసే కుట్రలో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి గురుకుల పాఠశాలలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్యలను పరిష్కరానికి ముందుకు రాకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ బొమ్మలరామారం మండలాధ్యక్షుడు పోలగాని వెంకటేశ్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ గూదె బాలనర్సింహ, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు రేకల రమేశ్ యాదవ్, మండలాధ్యక్షుడు బాల్‌సింగ్, బీఆర్ఎస్ యూత్ విభాగం అధ్యక్షుడు భట్కీర్ బీరప్ప, బీఆర్ఎస్ నాయకులు పూడురి నవీన్‌గౌడ్, రాజుయాదవ్, రాజ్‌కుమార్, జూపల్లి భరత్, మాజీ ఎంపీటీసీ భాస్కర్, నాయకులు గులని వెంకటేశ్, జూకంటి శ్రీకాంత్, బాల్‌సింగ్, బాలు పాల్గొన్నారు.



చీకటిమామిడి జ్యోతిబాపూలే గురుకులలోకి వెళ్లకుండా బీఆర్ఎస్వీ నాయకులను అడ్డుకుంటున్న ప్రిన్సిపాల్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భూ నిర్వాసితులు, తెలంగాణ రైతు సంఘం నాయకులు

## భూమికి బదులు భూమి ఇవ్వాలి

- సరైన పరిహారం ఇవ్వకపోతే రహదారి పనులను అడ్డుకుంటాం
- కలెక్టరేట్ ఎదుట ఆందోళన ఆందోళన

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 2 : రంగారెడ్డి జిల్లా గౌరెల్లి నుంచి కొత్తగూడెం వరకు చేపడుతున్న జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులందరికీ భూమికి బదులు భూమి లేదా ఎకరానికి రూ.3కోట్ల పరిహారం చెల్లించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు భూ నిర్వాసితుల సంఘం, తెలంగాణ రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. భూదాన్‌పోచంపల్లి, వలిగొండ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు మాటూరి బాలరాజు, కొండమడుగు నర్సింహ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల నుంచి భూములను లాక్కొని సరైన న్యాయం చేయకపోవడం దారుణమన్నారు. భూదాన్‌పోచంపల్లి, వలిగొండ మండలాల్లో 20 గ్రామాల్లో 500 ఎకరాలకు పైగా భూమిని గౌరెల్లి–కొత్తగూడెం జాతీయ రహదారికి రైతుల నుంచి తీసుకుంటున్నదని తెలిపారు. మార్కెట్‌లో ఎకరం ధర రూ.3కోట్లు ఉంటే ఏడున్నర లక్షలు చెల్లిస్తామనడం అన్యాయమని అన్నారు. భూదాన్‌పోచంపల్లి, వలిగొండ మండలాలను గ్రీన్ బెల్ట్‌గా ప్రకటించిన ప్రభుత్వం సరైన నష్టపరిహారం చెల్లించకపోతే రైతులు ఏం కావాలని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాకపోతే భూ సేకరణను అడ్డుకుంటామని హెచ్చరించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావును కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, సీఐటీయూ జిల్లా నాయకుడు మంచాల మధు, పిల్లాయిపల్లి మాజీ సర్పంచ్ అందెల హరీశ్, భూ నిర్వాసితులు, గూడూరు బుచ్చిరెడ్డి, మల్గ రవీందర్, భీమిరెడ్డి నరేందర్‌రెడ్డి, మామిళ్ల యాదయ్య, డేగల కిష్టయ్య, గాదగోని మల్లేశ్, వారాల శేఖర్‌రెడ్డి, ఉడతల రాందాస్, గంగమోని మధు, కోట రంగారెడ్డి, భూపాల్‌రెడ్డి, లింగస్వామి, లక్ష్మిరెడ్డి, వెంకటేశం, జంగారెడ్డి, గోవర్ధన్, రాములు, పద్మ, లక్ష్మమ్మ, విజయ రెడ్డి, ప్రసన్న లక్ష్మి, కిష్టయ్య, సాయిలు, నరసింహ, పర్వతాలు, మహిపాల్‌రెడ్డి, మహేందర్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం భూ నిర్వాసితుల కమిటీ కన్వీనర్‌గా గూడూరు బుచ్చిరెడ్డిని, కో– కన్వీనర్‌గా మల్గ రవీందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భవిష్యత్ కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

# రేషన్ పంపిణీకి బియ్యం లేవ్..

**వెలవెలబోతున్న గోదాములు... గత నెల కంటే దుర్భర పరిస్థితి**

- 4,705 మెట్రిక్ టన్నులకు గాను 830 మెట్రిక్ టన్నులే సరఫరా
- గత పదేండ్లలో ఇలాంటి పరిస్థితి లేదంటున్న డీలర్లు
- అయ్యా... బాబూ అంటూ మిల్లుల చుట్టూ అధికారుల చక్కర్లు
- ఈ నెల పంపిణీ ఎప్పుడు షురూ అయ్యేనో?

పేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యానికి సూర్యాపేట జిల్లాలో కరువు ఏర్పడింది. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి రేషన్ డీలర్లకు సరఫరా చేయాల్సిన గడువు ముగిసినా జిల్లాలోని గోదాములు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కనీసం 10 శాతం లక్ష్యం కూడా చేరుకోలేదు. ప్రతి నెల 20 నుంచి నెలాఖరు నాటికి 610 రేషన్ షాపులకు 4,705 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయాల్సి ఉండగా.. ఈ నెల గడువు దాటి మూడు రోజులైనా కేవలం 117 షాపులకు 830 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే సరఫరా చేశారు. గత నెలలో కూడా ఇదే పరిస్థితి ఉండగా, ప్రస్తుతం పౌరసరఫరాల అధికారులు మిల్లర్ల చుట్టూ తిరుగుతూ అయ్యా... బాబూ బియ్యం పంపండి అంటూ బతిమిలాడుకుంటున్నారు. – సూర్యాపేట, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ)

త్వరలోనే రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం ఇస్తామంటూ ఇటీవల మంత్రులు గొప్పలకు పోగా.. వాస్తవానికి దొడ్డు బియ్యానికే దిక్కు లేని పరిస్థితి. జిల్లాలో ఫుడ్ సెక్యూరిటీ, అంత్యోదయ, అన్నపూర్ణ తదితర కార్డులు కలిపి 3,24,188 ఉండగా, నెలనెలా ఆయా రేషన్ షాపుల్లో ఉండే పాత స్టాక్ ను బట్టి 4,800 నుంచి 5,900 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ జరుగుతుంది. డిసెంబర్ నెలకు సంబంధించి 4,705 మెట్రి క్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేయాల్సి ఉంది. కానీ, జిల్లాలోని ఎఫ్‌సీఐ, ఎస్‌డబ్ల్యూసీ గోదాములు ఖాళీగా కనిపిస్తున్నాయి. గడువు ముగిసినా నేటికీ పది శాతం కూడా సరఫరా కాలేదు. గత బీఆర్ఎస్ పాలనలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదని రేషన్ డీలర్లు చెబుతున్నారు. ప్రస్తుతం రెండు, మూడు నెలల నుంచి గోదాములు ఖాళీగానే కనిపిస్తున్నాయి. సాధారణంగా ప్రతి నెల 23 నుంచి నెలాఖరు వరకు గోదాముల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లు, అక్కడి నుంచి రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేస్తారు. ప్రతి నెల ఒకటో నుంచి 15 వరకు డీలర్లు రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీ చేస్తారు. డీలర్ల వద్ద ఉండే ఈ–పాస్ మిషన్లు కూడా 15వ తేదీ సాయంత్రం ఆన్‌లైన్ ఆఫ్ అవుతాయి. అలాంటిది గత నెల 15 వరకు కూడా డీలర్లకు బియ్యం సరఫరా కావడంతో నెలాఖరు వరకు ఈ పాస్ మిషన్ సేవలను అందుబాటులోకి ఉంచి పంపిణీ చేశారు.



ఖాళీగా దర్శనమిస్తున్న బియ్యం గోదాం

### ముందు చూపు లేకనే..

కాంగ్రెస్ సర్కారు అసమర్థత, ముందుచూపు లేమితోనే గోదాములు ఖాళీ అయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొనుగోలు కేంద్రాల నుంచి పెద్దఎత్తున ధాన్యం కొనుగోలు చేసి సీఎంఆర్ కోసం మిల్లులకు ఇచ్చి సరైన సమయంలో బియ్యం తీసుకోగా ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో రేషన్ బియ్యం సేకరణ కష్టంగా మారింది. బియ్యం రేషన్ షాపులకు వస్తున్న కార్డుదారులు డీలర్లు బియ్యం ఇంకా రాలేదని చెప్తుండడంతో వెనుదిరుగుతున్నారు. పౌర సరఫరాలు, రెవెన్యూ అధికారులకు జిల్లాలోని మిల్లులకు తిరుగుతూ బియ్యం సరఫరా చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం నిధులు లేకపోగా నిధులు వచ్చిన వెంటనే డబ్బులు ఇస్తామని బతిమాలడడం, కొన్ని సందర్భాల్లో బెదిరింపులకు దిగడం చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. వారం నుంచి మిల్లుల చుట్టూ తిరిగి కేవలం 825 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే సేకరించగా, సోమవారం మరో ఐదు మెట్రిక్ టన్నులు కలిపి మొత్తం 830 మెట్రిక్ టన్నుల బియ్యం తీసుకువచ్చినట్లు సమాచారం. ఈ పరిస్థితి ఇంకా ఎన్ని నెలలు ఉంటుందో, ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొవాలోనని డీలర్లు విసుగెత్తిపోతున్నారు.